కథా నిలయం
శ్రీకాకుళం

# పైకొచ్చాడు

మాటవరసకు నువ్వొత్తి వెధవ్వనుకో. (ఈ మాట నువ్వూ నేనూ కూడా ఒప్పుకోనవసరం లేదు) నీకు ఏ గుడ్డూ తెలీదనుకో. అయినా నువ్వు పైకి రావచ్చు. నీకన్నా చవటలు. నీ వున్న స్థాయికన్నా పదిపదిహేను మెట్లకు పైగా ఉన్నారు. నా మాటమీద నీకు నమ్మకం లేకపోతే జగన్నాథాన్ని చూడమంటాను. అప్పటికీ నీకు నమ్మకం లేకపోతే, నీ కర్మకు నేను చేయగలిగిందేమీ లేదు.

జగన్నాథాన్ని గురించి మహా అయితే, నీకు మూడు నాలుగేళ్ళ నుండీ తెలుసునేమో! నాకు- వాడింత గుంటడప్పణ్ణించీ తెలుసు. వాడి ధోరణి వొకటే పైకి పాకటం! ఏ పనులు చేస్తే మనిషి పైకెక్కుతాడో, అవన్నీ వాడుచేశాడు.

ఆ చేయడంలో జగన్నాథం ఉచ్ఛనీచాలు ఏనాడూ గమనించ లేదు. లక్ష్యాణం చేరుకోవడమే తప్ప; అందు కనుసరించే మార్గా లనుగురించి, వాడికి పట్టింపు లేదు.

ఈ ధోరణి వాడిలో ఈ మధ్యనే వచ్చిందని చాలా మంది అనడం నాకు తెలుసు. కానీ, నన్నడిగితే, జన్మతోనే ఈ మహాస్త్రాలను వాడు తెచ్చుకొన్నాడంటాను.

బాగా చిన్నప్పుడు, వాడూ, నేనూ కలిసి గోలీలాడాం. గోటీబిళ్ళలాడాం. చెడుగుడులాడాం. చెరపట్టీలాడాం. ఆనాడే మనవాడిలో ఈ లక్షణాలున్నాయి. ఉన్నాయని మొదటిగా గుర్తించినవాణ్ని, నేనొక్కణ్నే! తక్కిన మందికి ఈ ధ్యాస ఉండేది కాదు.

జగన్నాథంలో ఉన్న గొప్పతనమేమిటంటే, 'తనది' అని చెప్పుకోదగ్గ జీవితం లేకపోవడం. నువ్వేది బాగున్న దంటే, వాడూ అదే బాగున్నదంటాడు. నీకేది అసహ్యంగా ఉంటే తనకూ అదే అసహ్యంగా ఉన్నదంటాడు. చిత్రమేమి టంటే ఈ రెండు దృక్పథాలకూ, వాడు కారణాలను చెప్ప గలగడం, మళ్ళీ ఆ కారణాలు చాలా సహజంగా కూడా ఉన్నట్టు కనబడడం.

ఒకప్పుడు జగన్నాథం దేశభక్తుడు. అయితే కావాలని తను దేశ సేవలోకి ఉరకలేదని నాబోటివాళ్ళతో, చాటుగా అంటాడనుకోండి. కానీ పైకి మాత్రం దేశభక్తుడే! ఈ పెట్టు బడితో వాడు అమోఘమయిన విజయాలను సాధించాడు.

పేమా పేమీలను చేత చిక్కించుకొన్నాడు. వాళ్ళచుట్టూ తిరిగాడు. వాళ్ళను తన చు తిప్పుకొన్నాడు.

"మనం చేసే వొక్కో పొరబాటు వల్ల మనం ఊహిం చని మహాద్భుతాలు జరుగుతాయి. అందుకు నా జీవితమే చూడరాదూ"...? అన్నా డొకసారి జగన్నాధం.

"అదేమిటో చెప్పరాదా ?".

"మళ్ళా ఎక్కడా అనవొక" మంటూ జగన్నాధం చెప్పుకొచ్చాడు. "నేనప్పుడు ఫిఫ్త్ ఫారం చదువుతున్నాను. నేనెంత కష్టపడేదీ నీకు తెలుసుగదా! అయినా హెడ్ మాష్టరు నన్ను తప్పించాడు. "ఇది చాలా అన్యాయ మన్యాయ" మని నేను పది మందికీ చెప్పాను. పిల్లలందర్నీ, స్కూలు మానేయమన్నాను. దాదాపు నాలుగు రోజులు పాటు స్కూలు మూత పడింది. తరువాత పాస్ చేశారు. ఐనా నాకు చదువుమీద ధ్యాస మళ్ళింది కాదు. స్కూలుకు కరారావుడు చుట్టేశాను. పూర్తిగా దేశసేవలోకి దిగాను, అలా కాకున్నట్టయితే ఈ పాటికి ఏ ఐ. సి. యస్. నో. ఐ.ఎ.యస్. నో అయి ఉందును కానీ. పత్రికా ప్రపంచంలోకి రాకపోయే వాణ్నేమో" నన్నాడు.

జగన్నాధం నన్నెక్కడ బురిడీ కొట్టిందీ నాకు చాలా సేపటిగ్గానీ తెలియలేదు. వాడు స్కూల్లో తప్పిన మాట నిజమే! హెడ్ మాష్టరు తప్పించిన మాటా నిజమే! పాస్ కావడానికి, బస్తా కందులు, అర పెండె మిరపకాయలు జగ

న్నాథం నాన్న ఇస్తానన్నా హెడ్‌మాష్టరు వొప్పుకోలేదు.

"మీ వాడికి చదువంటదు. అంటుకునే దేదన్నా ఉంటే, డాన్ని చెప్పించండి, బావుంటుంది" అని సలహా ఇచ్చాడు హెడ్‌మాష్టరు.

దానితో రభస రేగింది. లేపింది కూడా జగన్నాథం గాడే. పిల్లలందర్ని — తప్పిపోయిన పిల్లల్ని - కూడగట్టాడు. ఊరేగింపులు లేవదీశాడు. సమ్మె నడిపాడు. ఎక్కడ అరాచకం జరుగుతుందా అని కాచుక్కూచునే జనం వాడికి ఊతమిచ్చారు. నాలుగు రోజులపాటు ఊరు ఊరంతా ఉడికిపోయింది. ఆఖరికి హెడ్‌మాష్టర్ దిగొచ్చాడు. రాకేం చేస్తాడు గనక ? అది కమిటీ స్కూలాయె ! మెజారిటీ సభ్యులు, జగన్నాథం కులం వాళ్ళాయె ! అందరూ కలిసి హెడ్‌మాష్టర్‌ను పీకిపారెయ్యాల్సిందే నన్నారు. ఆ అల్పజీవి, క్షమాపణ చెప్పుకోవడమే కాకుండా, జగన్నాథానికి పెద్ద మార్కులిచ్చి పాస్ చేశాడు. మన కథానాయకుడు సాధించిన తొలి విజయమిది. అప్పుడు నేనూ ఉన్నాను. కానీ నాకే మస్కాకొట్టాడు. ఇదీ మనవాడి ధోరణి.

అర్ధాంతరంగా మనవాడు చదువు మానేయడానికీ, దేశ సేవకూ సంబంధం లేదు. చదువు వంటబట్టదు గనుక మానేశాడు ఊరికే కూచోవటం వాడి స్వభావం కాదుగనుక, దేశసేవలోకి దిగాడు. "నాకు బానిసత్వమంటే మహా మంట. ఇంగ్లీషువాళ్ళు మనదేశం వొదిలిపోయిందాకా నేను వారి

పాఠశాలలో చేరను. తిలక్ మహాశయుడేం చెప్పాడు ? గాంధీజీ ఏం చెప్పాడు ? ఇంగ్లీషు చదువులు మానేయ మన్నాడు. కోర్టుల్ని బహిష్కరించమన్నాడు. నేనా రెండు పనులూ చేశాను" అన్నాడొకసారి జగన్నాధం.

అప్పట్లో ఎన్నో పార్టీలున్నప్పటికీ, మనవాడు గెలిచే పార్టీలోనే చేరాడు. ఈ పార్టీలో బాగా డబ్బున్న వాళ్ళు న్నారు. పలుకుబడి ఉన్నవాళ్ళున్నారు. డబ్బు, పలుకుబడి ఎటువేపునుంటే అటే విజయమని మనవాడికి తెలుసు. హైస్కూల్లో సాధించిన విజయం ఇంకా కళ్ళముందాడుతూనే ఉన్నది.

మూడేళ్ళు గడవలేదు. జగన్నాధం గొప్పవా డయ్యాడు. వాడి ఫోటోలు అప్పుడప్పుడు పత్రికల్లో పడు తుండేవి. వాడి న్యూస్ చాలా తరుచుగా నేను చూస్తుండే వాణ్ని. కరువుకాటకాలను గురించి, వరదలను గురించి, అగ్ని ప్రమాదాలను గురించి వాడు చాలా పెద్దవారితో సంప్ర దిస్తుండేవాడు. ఈ సంగతిని నేను అనుభవపూర్వకంగా గమ నించాను.

అవకాశాన్ని కలిగించుకోవడంలోనూ, ఉన్న అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనూ, జగన్నాధం ఎప్పుడూ అప్రమత్తతతో వుండేవాడు. వాడికా తెలివితేటలు పుట్టుకతో వచ్చాయి.

టంగుటూరి ప్రకాశంపంతులుగారితో కలిసి, వాడు

ఫోటో తీయించుకున్నాడు. దాన్ని ఆదరిమిలా, మహోద్ధృతంగా ఉపయోగించుకొన్నాడు జగన్నాథం. మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం మంత్రివర్గం ఏర్పడ్డానికి ముందు ఆ ఫోటోను పత్రికలకు విడుదల చేస్తూ "మంత్రివర్గ నిర్మాణాన్ని గురించి జగన్నాథంతో సంప్రదిస్తున్న శ్రీ ప్రకాశంగారు" అని కింద రైటప్ రాయించాడు. ఆ తరువాత అదే ఫోటోను నేను మళ్ళీ పత్రికల్లో చూశాను. ఈసారి రైటప్ మరో రకంగా వుంది. "ఆంధ్ర రాష్ట్రంకోసం ప్రజానాయకులతో చర్చలు జరుపుతున్న ఆంధ్రకేసరి" అని అచ్చయింది. మూడో సారి కూడా అదే తంతులో దాన్ని వాడి పారేశాడు. జనానికి గుండెలు పగిలాయంటే తప్పేముందీ?

"పబ్లిసిటీ అనేది నాయకుడికి ప్రాణవాయువులాంటిది" అనేవాడు జగన్నాథం. "నువ్వేం చేశావన్నది ముఖ్యం కాదు. చేసినా చేయకపోయినా, చేసినవాడికన్నా మినుమిక్కిలి అలిసిపోతుండాలి. నువేంచేస్తే పది మందీ జేజేలు కొడతారో, ముందు ఆలోచించుకోవాలి. అవన్నీ చేశానని చెప్పుకోవాలి. అదీ కిటుకు" అన్నాడు జగన్నాథం ఒకసారి నాతో.

ఎదటి వాడి గుండెలు ఆవటిల్లేలాగా మాట్లాడటంలోనూ, వాణ్ని లోబరుచుకోవటంలోనూ, జగన్నాథం ప్రత్యేకమైన కృషి చేశాడు.

నీతో మాట్లాడుతూ మాట్లాడుతూ, ఛటుక్కున సర్దార్ వల్లబాయ్‌పటేల్‌నో, లార్డ్ మౌంట్‌బాటెన్‌నో కోట్‌చేస్తాడు.

"1947 జూన్ 19 వ తేదీన, లార్డ్ మౌంట్ బాటెన్ దేశ విభజనకు కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు. కానీ చేసినట్టు వెల్లడి చెయ్యలేదు. అయినా పటేల్ కీ సంగతి తెలుసు. ఆయన ఆగ్రహోదగ్రుడయ్యాడు. గాంధీజీ, నెహ్రూజీ ఎన్నో విధాలుగా నచ్చచెప్పిన తరువాత గానీ, పటేల్ ఒప్పుకొన్నాడు కాదు. పత్రికలవాళ్ళు చుట్టుముట్టి అడిగినప్పుడు, పటేల్ కు బదులుగా జవహర్ జవాబు చెప్పాడు. ఈ సమావేశం అయిన తరువాతనే, నేను జవహర్ తో భోజనం చేశాను. నాకు పెందరాడే అన్నం తినడం అలవాటని నెహ్రూకు తెలుసు. తన మూలంగా, నా భోజనానికి ఆలస్యమయినందుగ్గాను ఆయన చాలా నొచ్చుకొన్నాడు కూడా. నేను ఫర్వాలేదని చెప్పినా ఆయనగారు ఊరుకోలేదు. నిజానికి ఆ రాత్రి నేను అక్కడే ఉండవలసింది. కానీ, సర్ తేజ్ బహదూర్ సప్రూ నాతో మాట్లాడేందుకు వస్తానన్నాడు. అంచాత గొంతులో మెతుకులు గొంతులో ఉండగానే, బయలుదేరాను" అంటాడు జగన్నాథం.

ఈ దెబ్బతో సీతలతిరిగి నోట్లోకొచ్చి తీరుతుంది ! అలా రాక తప్పదు.

జగన్నాథం వొకోక్కసారి పరమ సత్యాలను చెబుతుంటాడు. అవి వింటుంటే నాకే బేజారెత్తి పోతుండేది.

"న్యాయం, అన్యాయం. నీతి, అవినీతి. ఇదంతా బోష్. గెలిచింది న్యాయం. ఓడింది అన్యాయం. నీతిగావుండి నువ్వు

సాధించలేని దాన్ని అవినీతిగా సాధించడంలో తప్పులేదు. అట్టడుగునుండి నీతిని ధర్మాన్ని. శీలాన్ని గురించి నువ్వెంత వాగినా. వినిపించుకునే నాధుడుండడు. పైకిరా. ఎత్తునకూచో. నువ్వేం చెయ్యి. అదంతా ధర్మంకిందనే చెల్లుబాటవుతుంది" అన్నాడోకసారి జగన్నాధం.

నీ విజయానికి కీలకమేమిటని అడిగాను వాణ్ణి జగన్నాధం క్షణ కాలం ఆలోచించి చిరునవ్వును చిందించి పారేశాడు.

"ప్రతిభ. నిరంతర కృషి" అన్నాడు నా కేసి చూస్తూ.

ఈ సమాధానం నాకు నచ్చలేదని గ్రహించాడుగావును, చప్పున ప్లేటు ఫిరాయించాడు.

"మరొక రెవరన్నా అడిగితే, నేనీసమాధానం చెబుతాను. అసలు సంగతేమిటంటే భాయీ! నువ్వెవరికీ చిక్కకుండా ఉండటం. అందరికీ నువ్వు, తమ మనిషివేనన్న విశ్వాసం కలిగించటం." అన్నాడు.

"ఇదెలా సాధ్యం?" అన్నాను నేను.

"ముందుగా నీ ఉద్దేశాలెప్పుడూ బయట పెట్టకు. ఎదుటివాడి ధోరణి కనిపెట్టు. వాడికేం చెబితే నచ్చుతుందో అదే చెప్పు. వాడు పడతిట్టినీ వాణ్ని నువ్వూ పడతిట్టు. ఎదటివాడి లోపాలను సద్గుణాలుగా మార్చి మాట్లాడు. ఉదాహరణకు చూడు. నీ ఎదటి వాడికి చిరుకోప మనుకో. దాన్ని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యొచ్చు. కళా హృదయుల గ్గానీ ఉండని

ఉద్వేగం మీలో ఉన్నదంటే మీరు మరుగుపడిన మహా కళా కారులన్న మాట-అనిచూడు. వాడు మెత్తపడితే దాన్ని గురిం చేస్ట్రెస్-చేయి. బస్-కరిగి పోతాడు." అన్నాడు జగన్నాథం.

పైవాళ్ళను ఉబకేస్తూ ఉండు. వారి అవసరాలను తీరుస్తూ ఉండు. వారి స్నేహితుల దగ్గర వారిని గురించి ఆకా శానికెత్తుతూ ఉండు ఇవన్నీ నీకు క్రమక్రమంగా 'పే' చేస్తాయి. అబ్బాయ్! ఒక్కటి చెబుతానువిను. ఎదుటివాడిలోని బలహీన తల్ని కనుక్కోనడమూ, వాటిని టికిల్ చెయ్యడమూ, ఈ విధానంలోని మూలసూత్రాలు" అని హితోపదేశం చేశాడు. జగన్నాథం.

"నువ్వెంత సేపటికీ పైవాళ్ళ సంగతే మాట్లాడుతావేం? నీకన్నా కిందివాళ్ళూ ఉంటారుగా! వారి సంగతేమిటి!" అన్నాను.

జగన్నాథం చిరినవ్వు తొణికించాడు.

'నీ కిందివాళ్ళనూ పొగుడు. కానీ దానికొన్ని కిటుకు లున్నాయి. మాట- వరసకు. నీ క్రింద పదిమంది పనిచేసేవా రున్నారనుకో. వాళ్ళల్లో ఇద్దర్ని చేరదియ్యి. వాళ్ళను దువ్వు తుండు. వారితో అప్పుడప్పుడు ఏకాంత సంభాషణలు జరుపు తుండు. వాళ్ళ బాధల్ని భూతద్దంలోంచి చూపించు. సాను భూతిగా మాట్లాడు. పైకి లాగుతానను. ఆశ చూపించు. దీంతో వాళ్ళు జావజావయి పోతారు. మిగిలినవాళ్ళ మీద ఈ ఇద్దర్నీ వేగు నడుపు. ఎవరెవరు ఏమనుకొంటున్నదీ ఈ

ఇద్దరి ద్వారా విను. వాళ్ళు కూడా ఆశకొద్దీ ఉన్నవీ లేనివీ చెబుతారు. అంటే-ఉన్న పదిమందినీ నువ్వు చీల్చావన్న మాట. సహజంగా మిగిలిన ఎనిమిది మందికీ కడుపులో మండుతుంది. వాళ్ళింకా పెచ్చరేగి పోతారు. ఇంకా ఇంకా వాగుతారు. ఇదంతా ఆ ఇద్దరు దూతలూ నీకు మోస్తారు. ఇదే పంపిణీ" అని సలహా ఇచ్చాడు జగన్నాథం.

"ఇలా ఎంతకాలం సాగుతుం ?" దన్నాను నేను అనుమానంగా.

"సాగినంత కాలమే నాయె ! ఎప్పుడు కథ ఆగిపోతే, అప్పుడు నువ్వే అడ్డం తిరుగు. మిగిలిన ఎనిమిది మందిని విడివిడిగా చాటుకు పిలిచి మాట్లాడు. ఒకడితో చెప్పింది మరొకడితో చెప్పకు. వీరందరూ ఏకమయి, ఏమి టేమిటని కూడబలుక్కుంటారనుకో, ఏమీ లేదని అందరూ అంటారు. కానీ ఎవ్వరూ నమ్మరు. ప్రతివాడూ మిగతా ఏడుగుర్నీ అనుమానిస్తాడు. ఈ మహా కల్లోలం అణగిపోవట మంటూ జరగదు. కావలిస్తే చూసుకో !" అన్నాడు జగన్నాథం.

"నీ సిద్ధాంతమే నీ మీద ఎవడన్నా ప్రయోగిస్తే ఏమవుతుంది ?" అనడిగాను.

"ఏమీ కాదు" అని నవ్వాడు జగన్నాథం. "ఎందుకంటే, అవతలివాడు ప్రారంభం చేసీ చేయకముందే, మనకు 'మస్కా' కొడుతున్నాడని తెలిపోతుంది ! ఈ రకమైన ధోరణికి మనం 'ఇమ్యూన్' ఐపోయి ఉంటాం గనక, మనల్నేమీ

చెయ్యలేడు. కాక, మనం చలించిపోయేటంత గొప్ప ట్రిక్ ప్లే చేశాడనుకో; వాణ్ణపుడు మనం 'గురువు' గా భావించి ఆ పద్ధతులన్నీ నేర్చేసుకొంటాం. తప్పేం లేదే!"

ఆ పూట జగన్నాథాన్ని భోజనాని కుండమన్నాను. అవతల పనున్న దన్నాడు. ఇంకో సారి వస్తా నన్నాడు.

"నీ దగ్గర నాకు మొహమాట మేమీ లేదురా నాయనా!" అంటూ వెళ్ళిపోయాడు.

జగన్నాథం వెళ్ళిపోయిన చాలా సేపటిదాకా, అతని మాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి. అతను చెప్పిన వన్నీ నిజమే ననడంలో సందేహం లేదు. తన అనుభవా లేమిటో నాకు దాపరికం లేకుండా చెప్పాడు. తను అవ లంబించిన పద్ధతుల్ని బయట పెట్టాడు. అట్టడుగునుండి, ఆకా శంలోకి చేరిన విధానాన్ని తెలివిడి చేశాడు. నీలాంటివా డెవడన్నా బాగుపడితే సంతోషిస్తాడే గానీ, విచారించడు. కానీ, నా కో సందేహం పట్టుకు పీడిస్తున్నది. ప్రతివాడూ మహర్షిగా లేనట్లే, జగన్నాథం కూడా మహర్షిగా లేడు. అలా రూపొందడాని కవసరమైన లక్షణాలు- మౌలిక లక్ష ణాలు- జన్మతః రావాలి. లేదా, తనచుట్టు ఉన్నవారి నుండైనా నేర్చుకోవాలి. ప్రస్తుతం నా చుట్టూ ఉన్నవారిలో అటువంటి బాపతులేదు. ముందా రకం జనాన్ని పోగుచేసు కొని, ఆ దరిమిలా వ్యవహారం నడుపుదా మనుకొంటున్నాను. ప్రయత్నం చేసి చూద్దాం. తప్పేముంది గనుక?